
కులాంతర వివాహాలను
వ్యతిరేకించే అతడు
తన కూతురు విషయంలో
తీసుకున్న నిర్ణయం?

# బతకనేర్చినవాడు



"ఆర్యులారా! సభను అలంకరించిన పెద్దలారా! మన ఆర్ష సంస్కృతిని పునరుద్ధరించ దీక్షపూనిన ఓ మహాభాగులారా! ఇందరు మహామహులు సమావేశమైన ఈ మహాసభలో మాట్లాడే అవకాశం నాకిచ్చిన మీ అందరికీ నా వందన శతములు. ఇంతసేపూ మన ఆర్ష సంస్కృతి ఉత్కృష్టతను గురించి, వర్ణాశ్రమధర్మాలను తు.చ తప్పక మనందరం ఆచరించవలసిన అగత్యం గురించి నాకు తెలిసిన కొద్దిపాటి విషయాలు మీకు చెప్పి మీ అమూల్యమైన కాలాన్ని ఎంతో వ్యయం చేశాను. కలియుగంలో వర్ణసంకరమౌతుందని మహర్షులు ఏనాడో చెప్పారు. అయినా మనందరం మన శక్తియుక్తులన్నింటిని ఒడ్డి ఆ దుర్ఘటన జరుగకుండా ప్రతిఘటించాలి. మన పిల్లలు వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసుకోవడానికి మనందరం ఎంతమాత్రం ఒప్పుకోకూడదు. ఈ ఇంగ్లీషు చదువులు వచ్చాక ఎప్పుడో రావలసిన ఘోరకలి ఇప్పుడే వచ్చింది. ఆ చదువులు తలకెక్కి మన పిల్లలు తెలివిమీరి వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటామనవచ్చు. దీనికి తోడు ఈ తలాతోకా లేని సినిమాలు ఒకటి. అవిచూసి కుర్రకారు ఆదర్శాలంటూ ప్రేమపాఠాలు వల్లించవచ్చు. ఇది మనందరికీ పరీక్షా సమయం. ఏది ఏమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ మనం ఈ వర్ణసంకరానికి తలఒగ్గకూడదు. అంతటి పరిస్థితే వస్తే మన పిల్లల్నైనా వదులుకోవాలి లేదా ప్రాణాలైనా వదలాలి. అంతేకాని వర్ణసంకరానికి మాత్రం తలఒగ్గకూడదు. అందుకే గీతాచార్యుడు 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో



భయావహ: అన్నాడు. ముగిద్దామనుకుంటూనే ఇంతసేపూ మాట్లాడాను. ఇంకా మాట్లాడవలసిన పెద్దలు ఎందరో వున్నారు. వారందరి సందేశం విని మీరందరూ మీ కర్తవ్యనిర్వహణలో లోపం రానీయరని భావిస్తున్నాను. ఇంతటితో మీ అందరి సెలవు తీసుకుంటున్నాను'' అంటూ తమ ఆవేశ పూరితమైన ప్రసంగాన్ని ముగించారు.

ప్రభాకర్ అమాత్యులవారు. ఆయన రాష్ట్ర ధర్మోద్ధారక సమితికి అధ్యక్షుడు. పైగా పార్లమెంట్ సభ్యుడుకూడా.

సభలో కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. సముద్రుని హోరుని దాచివేస్తూ జోరుగా మ్రోగిన ఆ చప్పట్లకు అమాత్యుల వారి హృదయం జీలుగబెండులాగా తేలికైపోయింది. ఆ ఆనందం పట్టలేక గుండె విచ్చుకుపోతుందేమోనని భయం వేసింది. కాని ఆయన గుండె అంత తేలికగా ఆగే బాపతుదికాదు. ప్రస్తుతానికి పేరులో మాత్రమే 'అమాత్య' పదం వుంది. అది సార్థకమై ఏనాటికైనా ప్రభుత్వంలో కూడా అమాత్యులు కావాలని ఆయన ఆకాంక్ష. అది నెరవేరనిదే అది ఆగే ప్రసక్తి లేదు. వేదికమీదున్న తన ఆసనం మీద కూర్చుని చిరునవ్వు ముఖంతో సభికులవంక చూస్తూ, తన తర్వాత మాట్లాడుతున్నవారి ప్రసంగాలకు తల ఆడిస్తూ కూర్చున్నాడు.

మరో గంటలో సభ ముగిసింది.

ప్రభాకరామాత్యుడు సభ నిర్వాహకులవద్ద, సహోపన్యాసకులవద్దా సెలవుతీసుకుని, ఇంటికి బయలుదేరారు. వేదిక దిగి వెళ్తుంటే కొందరు ఆయన ఉపన్యాసాన్ని ప్రశంసిస్తుంటే, విజయగర్వంతో వెళ్లే వీరునిలాగా గంభీరంగా సాగిపోయాడు.

ఆ సభలకు ప్రతిస్పందన బాగా వుంటుండడంతో వర్ణాశ్రమ ధర్మ పునరుద్ధరణ గురించి తరచుగా ఉపన్యాసాలు ఇస్తుండడమే కాకుండా పత్రికలలో శరపరంపరగా వ్యాసాలుకూడా రాయడం మొదలుపెట్టారు. ఆయన అనుయాయులు వీరభోగ వసంతరాయలు ఆయన రూపంలో అవతరించాడని అనుకోసాగారు.

◇ ◆ ◇

ఒక ఏడాది గడిచిపోయింది.

ప్రభాకరామాత్యుల ధర్మసంస్థాపనోద్యమం జోరుగా సాగిపోతోంది.

ఆరోజు రాత్రి అమాత్యులవారు ఒక ఉపన్యాసంలో పాల్గొని తిరిగి వచ్చారు. భోజనం చేసి వచ్చి, వరండాలో వాలుకుర్చీలో నడుంవాల్చి పేపరు చదువుకోసాగారు.

ఆయన భార్య వంటింటిపనులు పూర్తిచేసుకుని వచ్చి చెంగుతో చేయితుడుచుకుంటూ ఆయన ఎదురుగా కుర్చీలోకూర్చుంది.

అమాత్యులవారు తలెత్తి ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశారు. ఏదైనా ముఖ్యమైన విషయం మాట్లాడవలసి వచ్చినప్పుడే ఆమె వచ్చి ఆ విధంగా కూర్చుంటుందని ఆయనకు తెలుసు. సావిత్రమ్మగారు అందుకుంది.

"మీరిలాగే ఊళ్లో ఉపన్యసిస్తూ, ఇంట్లో పేపర్ చదువుతూ కూర్చోండి. ఓ ప్రక్కనుంచి కొంపలు అంటుకుపోతున్నాయి" కట్టలు తెంచుకున్న వరద నీటిలా ఆమె వాక్ప్రవాహం సాగసాగింది.

భార్య ధోరణి క్రొత్తగా వుండడంతో 'అసలు ఏం జరిగిందే?' అంటూ చేతిలో పేపర్ని మడిచి బల్లమీద పడేశారు అమాత్యులవారు.

"ఇంకా ఏం జరగాలండీ... ఒక్కగానొక్క కూతురని దాన్ని నెత్తిన పెట్టుకుంటే, అది పీకలమీదికి తెచ్చింది. కక్కలేక మింగలేక ఏడుస్తున్నాను నేను" అంటూండగానే ఆమె గొంతు రుద్ధమయింది.

"ఎవరూ... మన గీతా! ఏం చేసింది!" అంటూ ఆందోళనగా అడిగారు ప్రభాకరా

మాత్యులు.

"మీరేమో వర్ణాంతర, మతాంతర వివాహాలు కూడదు అంటూ అందరికీ చెవులు శంఖం పెట్టి ప్రచారం చేస్తూంటారు. అది మాత్రం తన క్లాస్‌మేట్ సుందరాన్ని ప్రేమించింది. అతను క్రైస్తవుడు. పులి కడుపున పిల్లి పుట్టినట్లు మీ కడుపున పుట్టి ఆ కులంకాని వాణ్ణి, వేరే మతంవాడిని ప్రేమించింది. ఇంతకన్నా పరువునష్టం పని ఇంకేముంటుంది?" అంటూ గోలపెట్టింది సావిత్రమ్మగారు. అమాత్యులవారి నెత్తిన మబ్బులేని పిడుగుపట్టినట్లయింది.


"ఏమిటే... నీవంటున్నది నిజమే?" అన్నారు జీరపోయిన కంఠంతో.

"అప్పుడే ఏమైందండీ... అది ఇంకా దూరంపోయి నెలతప్పింది. వాణ్ణే తప్ప ఇంకెవరినీ చేసుకోననీ, అవసరమైతే మనల్ని కాదని ఇంట్లోంచి వెళ్ళిపోయైనా పెళ్ళి చేసుకుంటానని భీష్మించుకు కూర్చుంది. పైగా వాళ్ళ వివాహం మర్యాదగా మన చేతులమీదుగానే చేయమని సలహా చెప్తోంది. ఇదీ దాన్ని కాలేజీకి పంపినందుకు వచ్చిన ఫలితం" అంటూ దుఃఖం ఆపుకోలేక వలవలా ఏడ్చింది సావిత్రమ్మగారు.

అమాత్యులవారికి గుండె ఆగినంత పనయింది. కొంచెం తెప్పరిల్లి "మరి ఇంతవరకు వచ్చేదాకా నాకెందుకు చెప్పలేదే. కొంపలంటుకుపోయాక ఇప్పుడు నేనేం చేయనే!" అంటూ వాపోయారు.

"నాకు మాత్రం ముందు తెలుసా ఏమిటి? నెల దాటిపోయి వాంతులు చేసుకుంటుంటే, నిగ్గదీసి అడిగితే నిజం బయటపడింది. జరిగిందానికి ఏం చేయగలం? ఇప్పుడు కావలసింది ఏమిటో ఆలోచించండి" అంటూ తొందరచేయసాగింది ఆవిడ.

"అమ్మాయి మొండిపిల్ల. చెప్తే వినేరకం కాదు. ఒక్కగానొక్క కూతురని గారాం చేయడంతో ఇంతవరకు వచ్చింది. కానీ... బాగాఆలోచించి ఏంచేయాలో నిర్ణయిస్తా... ఆ... ఇంతకీ ఆ అబ్బాయి ఏం



చేస్తున్నాడు?'' అని అడిగాడు ఆయన.

''డిగ్రీ అయ్యాక ఐ.ఎ.ఎస్ కట్టాడట. ప్యాసయ్యాడట. త్వరలోనే ఉద్యోగం వస్తుందట''

''మనిషెలా వుంటాడు? నువ్వెప్పుడైనా చూశావా?''

''ఒకటి రెండుసార్లు అమ్మాయితో మనింటికి వచ్చాడు. తన క్లాస్‌మేటని గతంలో పరిచయం చేసింది. మనిషి చూడ్డానికి బాగానే వుంటాడు. అతను ఎలా వుంటేనేమిటి, ఏం చేస్తేనేమిటి మనకి పనికి రానప్పుడు''

''లేదు. ఊరికే తెలుసుకుందామని అడిగాను. సరే. నువ్వు పోయి పడుకో. నేను బాగా ఆలోచించి గీతతో మాట్లాడి, జరగాల్సిందేమిటో నిర్ణయిస్తాను''. సావిత్రమ్మగారు పడుకోడానికి వెళ్లిపోయింది.

◇ ◆ ◇

అమాత్యులవారు మంచంమీదనుంచి లేచారు. నిద్రలేచారు అనడానికి లేదు. ఎందుకంటే రాత్రంతా అసలు నిద్రపోలేదు కనుక. రాత్రంతా ఆయన మస్తిష్కం పాదరసంలాగా పరుగులు తీస్తూ తీవ్రంగా ఆలోచించింది. సుందరం బాగుంటాడని భార్య చెప్పింది. ఐ.ఎ.ఎస్‌కూడా పాసయ్యాడట. రేపో మాపో ఏ కలెక్టర్ ఉద్యోగమో వస్తుంది. అతను క్రిస్టియన్ అన్న విషయం తప్పిస్తే ఈ సంబంధంలో లోటేమి వుంది? ఇంతకన్నా మంచి సంబంధం వస్తుందా! కలెక్టర్‌గారి మామ అంటే తనకి ఎంత గౌరవం. పోనీ మొండికెత్తి పసేమిరా వీల్లేదు అందామంటే, గీత ఏమీ బెదిరిపోయి లొంగే ఘటంకాదు. ఆ అమ్మాయి తన కూతురు. తన పట్టుదలే ఆ అమ్మాయికీ వచ్చింది. నీ లెక్కేమిటని వెళ్లి రిజిస్టర్ మారేజ్ చేసుకుంటుంది. అప్పుడేం చేయాలి. అందుకే సౌమ్యంగా మర్యాదగా తమ పెళ్లి జరిపించమని చెప్పింది. ఆ మర్యాద దక్కించుకోపోతే నష్టపోయేది తనే. అందువల్ల ఏ విధంగా చూసినా ఈ పెళ్లికి ఒప్పుకోవడమే యుక్తం. కుంచంతో సరిగ్గా కొలవలేనప్పుడు తిరగవేసి కొలిచినా కొన్ని గింజలు వస్తాయి. పైగా అల్లుడు కలెక్టరు అయితే ఎన్ని పనులైనా చేయించుకోవచ్చు''

ఒక నిర్ణయానికి వచ్చి అమాత్యులవారు కాలకృత్యాలు ముగించుకువచ్చారు. అనారోగ్య కారణాలవల్ల తాను కొంత కాలం ధర్మోద్ధార సమితి కార్యకలాపాల్లో పాల్గొనలేనని ఉత్తరం వ్రాసి ఆ సంఘ కార్యదర్శికి పంపించారు.

నెలరోజులు గడిచాయి. అమాత్యులవారు 'కుల, వర్గ నిర్మూలనసంఘం' అన్న పేర ఒక సంస్థను స్థాపించారు. దానిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులచేత ప్రారంభం చేయించారు. ఆ సభలో మేఘగంభీర స్వరంతో ఉపన్యాసం మొదలుపెట్టారు.

''మహాజనులారా... ఇదే వేదికమీదనుంచి నేను ఎన్నోసార్లు ఆర్ష సంస్కృతి పునరుద్ధరణగురించి, వర్ణసంకరానికి వ్యతిరేకంగానూ ఉపన్యాసాలు చేసిన సంగతి మీకు తెలుసు. అటువంటి నేను ఇదే వేదికనుంచి ఈనాటి ఉపన్యాసం చేయడం ''కులవర్గ

నిర్మూలనసంఘం" స్థాపించడం మీ అందరికీ ఆశ్చర్యం కల్పించవచ్చు. కానీ నాకు మన శాస్త్రాలనూ, పురాణాలనూ తరచి చూడగా ఇందులో తప్పేమీ లేదనీ, ఇదంతా శాస్త్రసమ్మతమేననీ నమ్మకం కలిగింది. దేశ కాల పాత్రాలననుసరించి ప్రవర్తించాలన్నదే మన ఆర్ష సాంప్రదాయం. అందుకే త్రేతాయుగంలో గౌతమ స్మృతి చలామణిలో వుంది. మహర్షులు ప్రవచించిన స్మృతులే యుగధర్మాలననుసరించి మారిపోతుంటే సామాన్యులమైన మన సంగతి చెప్పేదేముంది? రాబోవు కాలమార్పులను జ్ఞాననేత్రంతో ఏనాడో దర్శించిన మన మహర్షులు ఈ కలియుగంలో వర్ణసంకరం జరుగుతుందని చెప్పారు. మరి మహర్షుల వాక్యాలను మార్చడం మన తరమా? యుగధర్మాన్ని ఎదిరించడం మనకు సాధ్యమా? అందుకే ప్రవాహాన్ని ఎదిరించి కొట్టుకుపోవడంకంటే, అనుకూలంగా పోయి గట్టెక్కడం మంచిదికాదా? అసలు వర్ణాంతర వివాహాలలో మాత్రం తప్పేమి వుంది? అవి మనకి కొత్తకావే. క్షత్రియుడైన శంతనుని భార్య సత్యవతి ఎవరు? మత్స్యకన్య. అంటే జాలరి వారి అమ్మాయికాదూ. వశిష్ఠ మహర్షి భార్య అరుంధతి మాలెతకాదూ? విశ్వామిత్ర మహర్షి భోగపత్ని మేనక కళావంతురాలు కాదూ? వారికి పుట్టిన శకుంతల కుమారుడు భరతుడేగా భరతచరిత్రకు ఆది పురుషుడు? ఈ విషయాలన్నీ సాకల్యంగా ఆలోచించి మారుతున్న నేటి సమాజంతోపాటు మనమూ మారకతప్పదని గ్రహించాము. బోయవాడైన వ్యక్తి. వాల్మీకి మహర్షిగా మారగలిగినప్పుడు నేను మారడంలో ఆశ్చర్యం ఏముంది? తప్పిదాన్ని ఆలస్యంగానైనా గ్రహించి దిద్దుకోవడం మంచిదికాదా? తప్పు చేయని మానవుడు ఎవరు? చేసిన తప్పు ఒప్పుకోవడంలోనే గౌరవం వుంది. అందుకే నా తప్పును ఒప్పుకుంటూ నా భావాలను మార్చుకుంటున్నాను. అయితే కేవలం భావాలను, అభిప్రాయాలను మార్చుకున్నంతలో ఫలితం లేదుకనుక, నా ఆశయాలను ఆచరణలో చూపదలచుకున్నాను. అందుకే కొద్దిరోజులలోనే మీ అందరి సమక్షంలో నా ఒక్కగానొక్క కూతురి వర్ణాంతర వివాహం చేసి, నా చిత్తశుద్ధిని, కార్యదీక్షను నిరూపించదలిచాను. నా ఈ నిర్ణయాన్ని మీరందరూ ఆమోదించి, హర్షించి, అనుసరించి, ఈ నూతన కులవర్గ నిర్మూలన సంఘానికి ఉజ్వల భవిష్యత్తును కల్పిస్తారని ఆశిస్తూ ఇంతటితో విరమిస్తున్నాను' అంటూ ఉపన్యాసం ముగించారు అమాత్యులవారు.

జనంలో ఒక ప్రక్కనుంచి ఈలలూ, కేకలూ వినిపించాయి. కొంచెం సేపట్లో సద్దుమణిగింది. ఈ రెండూ చేయని కొందరు మాత్రం "ఏమైనా ప్రభాకర్ అమాత్యుడు, బతకనేర్చినవాడు" అని తమలో తామే గుసగుసలాడుకోసాగారు.

మరో నెలలో అమాత్యులవారు బహిరంగ వాగ్దానం చేసినట్లు గీతకీ, సుందరానికీ వైభవంగా వివాహం జరిగింది.

◇ ◆ ◇